• దిగుబడి రాకపాయే.. ధర లేకపాయే

నిజామాబాద్ మార్కెట్‌కు వచ్చిన పసుపు పంట

పసుపు ధర నేలచూపు

- దుంపకుళ్లుతో తగ్గిన పంట దిగుబడి
- ఎకరాకు 15-20 క్వింటాలే
- పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- నేమ్‌ప్లేట్‌కే పరిమితమైన పసుపు బోర్డు
- 500 బోనస్ ఇవ్వాలని రైతుల డిమాండ్

నిజామాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్రంలో పసుపు రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది. దుంపకుళ్ల తెగులు ప్రభావంతో దిగుబడి భారీగా తగ్గిపోయింది. ఎకరానికి సరాసరి 30 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా, ఇప్పుడు 15-20 క్వింటాలు రావడం గగనమైపోయింది. ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు, అటు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పసుపు రైతు సంక్షేమాన్ని గాలికొదిలేయగా.. మార్కెట్‌లో దళారులు నిండా ముంచుతున్నారు.

తగ్గిన సాగు విస్తీర్ణం

నిజామాబాద్ జిల్లాలో గతంలో 50 వేల ఎకరాల్లో పసుపు సాగయ్యేది. నష్టాలకు తోడు మద్దతు ధర దక్కకపోవడం, పెట్టుబడి సాయం అందకపోవడంతో సాగు విస్తీర్ణం 32 వేల ఎకరాలకు పడిపోయింది. సాధారణంగా ఈ విస్తీర్ణంలో 10 లక్షల క్వింటాళ్ల దిగుబడి రావాలి. కానీ, దుంపకుళ్ల కారణంగా 5-7 లక్షల క్వింటాళ్ల దిగుబడి రావడమే కష్టంగా మారింది. పంట దిగుబడి తగ్గితే ధర పెరగాలి. కానీ, ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో దళారుల ఇష్టారాజ్యం నడుస్తున్నది. క్వింటాలుకు రూ.9 వేల నుంచి రూ.11 వేల వరకే చెల్లిస్తున్నారు.

పత్తాలేని ఎంపీ అర్వింద్

సంక్రాంతి రోజున హడావుడిగా పసుపుబోర్డును ప్రారంభించిన బీజేపీ ఎంపీ అర్వింద్ ఇప్పుడు పత్తా లేకుండాపోయారు. నేమ్ ప్లేట్‌కే పరిమితమైన పసుపుబోర్డుతో రైతులకు ఒరిగిందేమీ లేదు. అంతేకాదు, గతంలో ఏర్పాటు చేసిన స్పైసెస్ బోర్డు ద్వారా కూడా ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. ఈ నేపథ్యంలో పసుపు పంటకూ రూ.500 బోనస్ ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మునుపటి లెక్క లేదు

7 ఎకరాల్లో పసుపు సాగు చేసిన. ఎకరాకు రూ.లక్షన్నర లెక్కన పది లక్షల దాకా ఖర్సయింది. దిగుబడి మునుపటి లెక్క లేదు. సరైన ధర అత్తలేదు. రేటు రాక, పంట ఎళ్లక రైతు నష్టపోతుండు.

– మిట్టపల్లి ముత్తెన్న, పసుపు రైతు

15 వేలుంటేనే ఫాయిదా

దుంపకుళ్లు సోకి పంట దిగుబడి తగ్గిపోయింది. బిగాన రూ.15 వేల దాకా ఖర్సు పెట్టి మందులు స్ప్రే చేయించినా లాభం లేకపాయే. అనుకున్నట్టు పంట ఎళ్లకపాయే. తక్వల తక్వ క్వింటాలుకు రూ.15 వేలు ధర ఉంటేనే రైతుకు ఫాయిదా.

– మిట్టపల్లి చిన్నయ్య, పసుపు రైతు

పత్తి ధరపై రైతు కన్నెర్ర

- రెండు రోజుల్లో 2 వేలు తగ్గింపుపై ఆగ్రహం
- ధర పెంచాలని రాజీవ్ రహదారిపై ధర్నా
- పెద్దపల్లిలో భారీగా ట్రాఫిక్ జాం

పెద్దపల్లిలోని రాజీవ్ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

పెద్దపల్లి, జనవరి 30: పత్తి ధర పెంచాలని డిమాండ్ చేస్తూ పెద్దపల్లి జిల్లా కేంద్రంలో రైతులు రోడ్డెక్కారు. రెండు రోజుల వ్యవధిలో 2 వేలు ధర తగ్గించడం అన్యాయమంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం అమావాస్యతో మార్కెట్‌యార్డులో క్రయవిక్రయాలు జరగలేదని, సోమవారం క్వింటాలు పత్తి రూ.7 వేలు ఉండగా, గురువారం రూ.5 వేలకు పడిపోయిందని రైతులు వాపోయారు. పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ లక్ష్మణ్‌రావు ఘటనా స్థలానికి చేరుకొని రైతులకు నచ్చజెప్పారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, ఖరీదుదారులు, అధికారులు రైతులతో చర్చలు జరిపారు. చర్చ సాగుతుండగానే ఓ అడ్తిలో పత్తి తూకం వేస్తుండడంతో రైతులు కాంటాను ధ్వంసం చేశారు. పత్తి రేటు తగ్గించడంపై మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూపను నిలదీయగా క్వింటాలుకు రూ.50 పెంచేందుకు ఖరీదుదారులు ఒప్పుకున్నట్టు చెప్పారు. క్వింటాలుకు రూ.300 చొప్పున పెంచాలని రైతులు డిమాండ్ చేశారు. రూ.6500 కంటే ధర తక్కువ పడ్డ రైతులకు రూ.100 చెల్లిస్తామని చైర్‌పర్సన్ చెప్పడంతో కొంత మంది రైతులు పత్తిని విక్రయించారు.

దండం పెడుతున్న.. రేటు పెంచండి..

నేను పదెకరాలు కౌలుకు తీసుకొని పత్తి వేసిన. ఇప్పటి వరకు 20 క్వింటాళ్లు అమ్మిన. సోమవారం పెద్దపల్లి మార్కెట్‌లో 4 క్వింటాళ్లను రూ.7 వేల చొప్పున అమ్మిన. గురువారం 12 క్వింటాళ్ల దాకా తెచ్చిన. క్వింటాలుకు రూ.5 వేలు వేసిన్రు. రెండు రోజుల్లోనే రూ.రెండు వేలు తగ్గింది. గీ రేటు పడితే పెట్టుబడి ఖర్చులు, కూలీలకు సరిపోవు. ఇక కౌలు ఎట్ల కట్టాలె. దండం పెడుతున్న రేటు పెంచండి. లేదంటే అప్పుల పాలయితం.

- రంగు రాజమలు, బోజన్నపేట(పెద్దపల్లి మండలం)

నాణ్యత, నాసిరకానికి ఒకే రేటు..

ఈ మార్కెట్‌లో నాణ్యత, నాసిరకం పత్తికి ఒకే రేటు పడుతున్నది. చుక్క నీరు చల్లకుండా 3 బస్తాల్లో మేలు రకం పత్తిని తెచ్చిన. ఖరీదుదారులు చేతులతో పత్తి పట్టు కొని రేటు వేశారు. క్వింటాలుకు రూ.6911 వచ్చింది. రూ.7200 -7300 మధ్య వస్తదనుకున్న. మంచి పత్తి తెచ్చిన రేటు రాలేదు. నాణ్యత, నాసిరకం గుర్తించి రేట్లు వేయాలి.

- గుండాల సమ్మయ్య, బ్రహ్మణపల్లి (పెద్దపల్లి మండలం)

వ్యాపారులు కుమ్మక్కయిన్రు..

పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారులు కుమ్మక్కై రైతును ముంచుతున్నరు. ఐదెకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగు చేసిన. ఇప్పటి వరకు 20 క్వింటాళ్లు అమ్మిన. గిట్టుబాటు ధర రాలే. ఈరోజు ఏడు కింటాళ్ల తెచ్చిన క్వింటాలుకు రూ.6 వేలు పలికింది. పెట్టుబడి ఎక్కువై దిగుబడి రాక ఇబ్బంది పడుతుంటే ఇక్కడ వ్యాపారులు కుమ్మక్కై రైతును ముంచుతున్నరు.

- కలవేన గట్టయ్య, సబ్బితం (పెద్దపల్లి మండలం)

మిర్చి ధర భారీగా పతనం

- నాణ్యమైన మిర్చి క్వింటాల్ 14 వేలు
- ఖమ్మంలో కనిష్ఠ స్థాయికి జెండాపాట
- నిరుడు తాలు మిర్చికి 14 వేలు ధర
- ఆందోళన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

ఖమ్మం వ్యవసాయం, జనవరి 30 : ఖమ్మం మార్కెట్‌లో ఎర్ర బంగారం (తేజా రకం) ధర రోజు రోజుకూ పతనమవుతున్నది. పంట చేతికి వచ్చే సీజన్ కావడంతో గడిచిన వారంరోజుల నుంచి రికార్డు స్థాయిలో రైతులు మార్కెట్‌కు మిర్చిని తీసుకొస్తున్నారు. జిల్లా రైతాంగంతోపాటు పొరుగున ఉన్న భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలతోపాటు ఏపీలోని కృష్ణా జిల్లా నుంచి సైతం రైతులు పంటను తెస్తున్నారు. నిరుడు మార్కెట్‌లో మిర్చికి రికార్డు స్థాయి ధర పలుకడంతో రైతులు ఈ ఏడాది భారీగా సాగు చేశారు. తీరా పంట చేతికి వచ్చేసరికి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావమో, ఖమ్మం ఏఎంసీ మార్కెట్ మాయాజాలమో తెలియదు కానీ పదిరోజుల నుంచి ధర తగ్గకుంటూ వస్తున్నది. గత ఏడాది తాలు రకం పంటకు ఇదే మార్కెట్‌లో క్వింటాల్ రూ.14 వేలు వరకు పలికింది. కానీ ఈ ఏడాది సీన్ రివర్స్ అయ్యి ప్రస్తుతం ఇదే మార్కెట్‌లో జెండాపాటలో నాణ్యమైన పంటకు గరిష్ఠ ధర క్వింటాల్ రూ.14 వేలకు చేరి రైతులను మరింత ఆందోళనకు గురిచేసింది. గురువారం జెండాపాట సమయానికి రైతులు రికార్డు స్థాయిలో 50 వేల బస్తాలను యార్డుకు తీసుకురావడంతో మిర్చి యార్డు ఎర్ర బంగారంతో కళకళలాడింది. కొద్దిసేపటికే జెండాపాట తరువాత ఆశించిన ధర రాకపోవడంతో రైతుల ముఖాలు వాడిపోయాయి. కంట్లో ఒత్తులు పెట్టుకొని పంటను సాగు చేసిన రైతులు మార్కెట్‌లో పలుకుతున్న ధరను చూసి తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

ఖమ్మం యార్డుకు రైతులు తీసుకొచ్చిన మిర్చి బస్తాలు

• రుణమాఫీ చేయాలని శ్రీధర్‌బాబుకు వినతి

పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేట ఎక్స్ రోడ్‌లో గల సెంటినరీకాలనీ కేడీసీసీ బ్యాంక్ లో రుణం తీసుకున్న 56 మంది రైతులకు ఇంత వరకు మాఫీ కాలేదు. దీంతో రామగిరి, ముత్తారం గ్రామాల రైతులు మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్‌బాబుకు గురువారం వినతిపత్రం ఇచ్చారు. - రామగిరి

మా పొలాలు మాగ్గావాలె

- రెండో దఫా గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు సర్వేనూ అడ్డుకున్న రైతులు
- పోలీసుల పహారాలో అధికారుల సర్వే
- అధికారుల కాళ్లావేళ్లా పడిన సాకిబండతండా గిరిజన మహిళలు
- చేసేదేమీ లేక వెనుదిరిగిన అధికారులు
- గిరిజన రైతులకు అండగా బీఆర్ఎస్

గిరిజన రైతులతో మాట్లాడుతున్న కందుకూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

ఆమనగల్లు, జనవరి 30: రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని నుచ్చుగుట్టతండా, సాకిబండతండాల్లో చేపట్టిన గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు భూ సర్వేను గిరిజన రైతులు అడ్డుకున్నారు. 'మా పొలాలు మాగ్గావాలె' అని నినదించడంతో అధికారులు వెనుదిరగాల్సి వచ్చింది. అవుటర్ రింగ్ రోడ్డు నుంచి ఇబ్రహీంపట్నం, యాచారం, కందుకూర్, కడ్తాల్, ఆమనగల్లు మండలాల మీదుగా ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్డును అనుసంధానం చేస్తూ గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మించేందుకు ప్రభుత్వం సర్వే చేపట్టింది. గురువారం ఆయా తండాల్లో భూ సర్వే చేసేందుకు కందుకూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, అధికారులు రాగా రైతులు పొలాల్లో బైఠాయించారు. 'వద్దురా నాయనా రేవంత్‌రెడ్డి పాలన.. జై జవాన్, జై కిసాన్, ఇదేమీ రాజ్యం-దొంగల రాజ్యం, మా భూములు మాగ్గావాలె' అని నినదించారు. దీంతో అన్నదాతలకు నచ్చజెప్పేందుకు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి ప్రయత్నించారు. రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులను గుర్తించేందుకు మాత్రమే ఎంజాయ్‌మెంట్ సర్వే చేపడుతున్నామని, రైతులను గుర్తించి గ్రామ సభ ఏర్పాటు చేస్తామని తెలిపారు. 490 ఎకరాలు గుర్తించామని, 1.5 కిలోమీటర్లు మాత్రమే సర్వే చేయాల్సి ఉందని, 2013 భూ సేకరణ చట్టం ప్ర కారం ప్రభుత్వం పరిహారం చెలిస్తుందని తెలిపారు. అయినప్పటికీ, రైతులు వెనక్కి తగ్గలేదు. 'మాకున్న కొద్దిపాటి భూములను లాక్కుంటే ఎలా బతకాలి? పట్టణాలకుపోయి రిక్షాలు తొక్కాలా? కంపెనీల్లో జీతాలు ఉండాలా? మా గోసను అర్థం చేసుకుని మా భూములను లాక్కోవద్దు' అని అధికారులను వేడుకున్నారు. భూములను బలవంతంగా లాక్కుంటే ఇక్కడే ప్రాణాలు తీసుకుంటామని హెచ్చరించారు. 'ముఖ్యమంత్రి మా ప్రాంతం వ్యక్తి అయ్యిండు. మా ప్రాంతం బాగుపడుతుందని అనుకున్నం. కానీ, మా జీవితాల్లో పెద్ద బండరాయే వేసిండు' అని అన్నదాతలు వాపోయారు. సర్వేను వెంటనే నిలిపివేయాలని రైతులు డిమాండ్ చేశారు. దీంతో చేసేదేమి లేక అధికారులు వెనుదిరిగారు.

అండగా నిలిచిన బీఆర్ఎస్

గిరిజన రైతులకు బీఆర్ఎస్ నాయకులు అండగా నిలిచారు. ఆమనగల్లు పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్ ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు గిరిజన రైతులకు మద్దతు పలికారు. కాగా, సీఐలు ప్రమోద్‌కుమార్, శివప్రసాద్, నరహరి, ఎస్ శ్రీకాంత్ నేతృత్వంలో పోలీసులు, ప్రత్యేక బలగాలతో బందోబస్త్ చేపట్టారు.

గిరిజనులంటే సీఎం రేవంత్‌రెడ్డికి గిట్టదు

సీఎం రేవంత్‌రెడ్డికి మా గిరిజనులంటే గిట్టదు. గతంలో లగచర్లలో గిరిజన రైతుల నుంచి భూములు లాక్కునే ప్రయత్నం చేసిండు. అక్కడ మా గిరిజన బిడ్డలు తిరగబడితే వాళ్లను జైల్లో పెట్టించిండు. అది సరిపోనట్టు మళ్లీ మా భూముల మీద పడ్డడు. మాకు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు వద్దు. మా గిరిజన బిడ్డలు వ్యతిరేకిస్తున్నా పట్టించుకుంటలేడు. దీన్నిబట్టి సీఎం రేవంత్ గిరిజనులపై కక్ష్య కట్టిండని అర్థమవుతున్నది.

- నేనావత్ పత్యానాయక్, ఆమనగల్లు బీఆర్ఎస్ అధ్యక్షుడు

రైతులతో మీటింగ్ అని చెప్పి సర్వేలా?

గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో మొదట సమావేశం పెడుతామని, ఆ తర్వాతే సర్వే చేస్తామని మాయమాటలు చెప్పి.. గుట్టుచప్పుడు కాకుండా పోలీసుల పహారాలో సర్వే చేయడం సరైన విధానం కాదు. మేం గిరిజనులం, బలహీనులం, ఏం చేయలేమనే ఉద్దేశంతో మాపై, మా భూములపై అజమాయిషీ చేస్తున్నారు. మా ప్రాణాలైన తీసుకుంటాం కానీ, భూములను వదులుకోం.

రవి రాథోడ్, యువ రైతు సాకిబండతండా

పట్నంకు పోయి జీతాలుండాలా?

ఈ ప్రాంతంలో గిరిజనులు తమకున్న పావు ఎకరా, అర్ధ ఎకరా, ఎకరా భూముల్లో సేద్యం చేసుకుంటూ జీవితం వెళ్లదీస్తుర్రు సారు. ఉన్న భూములను గుంజుకుంటే మా గిరిజన బిడ్డలు పట్నంకు వలసపోయి జీతాలుండాలా? ఇప్పుడిప్పుడే అభివృద్ధిలోకి వస్తున్న గిరిజనులను మళ్లీ వందల ఏండ్లు వెనక్కి తీసుకుపోతుర్రు.

–రమేశ్ నాయక్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, గిరిజన నాయకుడు

సిద్దిపేటలో 124 ఎకరాల భూసేకరణ

- నోటిఫికేషన్ విడుదల చేసిన సర్కార్
- హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడి
- హైదరాబాద్‌లో కారిడార్ల దెబ్బ
- లగచర్లలో భయంనీడన గిరిజనం
- ఫోర్త్‌సిటీ రోడ్డు పేరిట ఊరూరా దడ
- బతుకుపై బెంగతో ఊరూరా జనం పోరుబాట

హైదరాబాద్, జనవరి 30(నమస్తే తెలంగాణ): సిద్దిపేట జిల్లాలో ఇండస్ట్రియల్ పార్క్ కోసం 124 ఎకరాల భూమిని సేకరించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్‌ను జారీచేసింది. హుస్నాబాద్ మండలం తోటపల్లితోపాటు అక్కన్నపేట మండలంలోని జనగాం, చౌటపల్లి గ్రామాల పరిధిలో 124.36 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించింది. టీజీఐఐసీ ఆధ్వర్యంలో పారిశ్రామిక పార్కు ఏర్పాటు కోసం భూములు సేకరిస్తున్నట్టు నోటిఫికేషన్‌లో పేర్కొన్నది. భూమి ప్లాన్‌తోపాటు ఇతర వివరాలు కలెక్టరేట్‌తోపాటు హుస్నాబాద్ డివిజనల్ కార్యాలయంలో అందుబాటులో ఉన్నట్టు ప్రకటించారు. ప్రజల అవసరాల నిమిత్తం ఈ భూముల్లో సర్వే నిర్వహణ, తవ్వకాలు జరపడం, బోర్లు వేయడం, నిర్మాణాలు చేపట్టడం తదితర పనులకు అధికారులకు అధికారం కల్పించినట్టు పేర్కొన్నారు. నోటిఫికేషన్ జారీ అయిన తేదీ నుంచి భూముల క్రయవిక్రయాలు, తాకట్లకు సంబంధించిన చర్యలు చేపట్టరాదని స్పష్టంచేశారు. అభ్యంతరాలు ఉన్నవారు నోటిఫికేషన్ జారీ అయిన తేదీ నుంచి 60 రోజుల్లోగా భూసేకరణ అధికారికి లిఖితపూర్వకంగా సమర్పించాలని కోరారు.

భూసేకరణ చేపడుతున్న ప్రాంతాలు

వికారాబాద్ జిల్లా లగచర్ల ప్రాంతంలో ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సుమారు 1,100 ఎకరాలు, సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని న్యాలకల్ మండలం మాడ్గి, డప్పూర్, వడ్డి తదితర గ్రామాల పరిధిలో పరిశ్రమల కోసం 2,000 ఎకరాలు, రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం తిమ్మాపూర్‌లో ఇండస్ట్రియల్ పార్క్ కోసం 567 ఎకరాలు, ఓఆర్ఆర్-ట్రిపుల్ ఆర్ మధ్య 100 మీటర్ల రేడియల్ రోడ్డు నిర్మాణం కోసం రంగారెడ్డి జిల్లా యాచారం, కడ్తాల్, ఆమనగల్లు మండలాల పరిధిలో 554 ఎకరాల భూములను సేకరించేందుకు ఇదివరకే ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నిమ్జ్ కోసం గతంలోనే దాదాపు 12,000 ఎకరాలు సేకరించగా, ఇప్పుడు మరో 2,000 ఎకరాల సేకరణకు చర్యలు చేపట్టడంపై స్థానికులు ఆగ్రహంతో ఉన్నారు. ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగం కోసం ఇంకా భూసేకరణ మిగిలే ఉండగా, దక్షిణ భాగం కోసం అలైన్‌మెంటు సిద్ధమయ్యాక భూసేకరణ చేపడతారు. అంతేకాదు, ఫార్మాసిటీని రద్దుచేసిన సందర్భంగా సీఎం మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా 10 ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేస్తామని, ఒక్కో విలేజ్ 1000-2000 ఎకరాల విస్తీర్ణంలో ఉండనున్నదని ప్రకటించారు. దీన్నిబట్టి మరిన్ని భూసేకరణ నోటిఫికేషన్లు జారీ అయ్యే అవకాశం ఉన్నదని స్పష్టమవుతున్నది.

30 లక్షల పరిహారానికి డిమాండ్

ప్రభుత్వ భూసేకరణ చర్యలకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా రోజుకో ప్రాంతంలో ఆందోళనలు జరుగుతున్నాయి. తమ జీవనోపాధి పోతుందని కొందరు, మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని మరికొందరు అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నారు. ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగం భూసేకరణలో నిర్వాసితులకు ఎకరాకు రూ.30 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని ప్రభుత్వం జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ)ను కోరింది. రాష్ట్రంలో భూసేకరణకు గరిష్ఠంగా ఎన్‌టీపీసీ రూ.30 లక్షల చొప్పున చెల్లించిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఇదే విధంగా ట్రిపుల్ ఆర్ బాధితులకు చెల్లించాలని ప్రభుత్వం పేర్కొన్నది. ఈ నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే భూసేకరణకు సైతం రూ.30 లక్షల చొప్పున ధరను నిర్ధారించి చెల్లించాలని, డిమాండ్ ఉన్న చోట అంతకు పెంచి ఇవ్వాలంటూ పెద్ద ఎత్తున డిమాండ్ వస్తున్నది. రాష్ట్రంలో భూముల ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో ప్రభుత్వం అరకొర నష్ట పరిహారం చెల్లిస్తామంటే ఊరుకునేది లేదని బాధితులు స్పష్టంచేస్తున్నారు.

రైతుభరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలిపారు. కామారెడ్డి జిల్లా పిట్లం మండలం అల్లాపూర్‌లో గురువారం సీఎం రేవంత్ దిష్టిబొమ్మ దహనం చేశారు. వద్దురా నాయన.. కాంగ్రెస్ పాలన, సీఎం డౌన్‌డౌన్ అంటూ నినదించారు. రైతుల ఆందోళనకు బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు.

మహబూబాబాద్ జిల్లా పోలంపల్లి తండామీదుగా బైక్ ర్యాలీ చేస్తున్న విజయ్

100% రుణమాఫీ అయ్యేవరకు పోరాటం

బైక్ యాత్ర ప్రారంభంలో భూక్యా విజయ్‌కుమార్

కురవి, జనవరి 30: వంద శాతం రుణమాఫీ అయ్యే వరకు పోరాటం చేస్తానని గిరిజన యువ రైతు భూక్యా విజయ్‌కుమార్ నాయక్ స్పష్టంచేశారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం హరిదాసుతండాకు చెందిన గిరిజన రైతు భూక్యా విజయ్‌కుమార్ రైతులందరికీ రుణమాఫీ, ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని కోరుతూ చేపట్టిన బైక్ యాత్ర గురువారం మొదలైంది. తల్లి భూక్యా సుశీల ఆశీర్వాదం తీసుకుని, బొడ్రాయివద్ద కొబ్బరికాయ కొట్టి బైక్‌యాత్రను మొదలు పెట్టారు. మద్దతుగా రైతులు బానోత్ వీరన్న, భూక్యా ప్రసాద్ పాల్గొనగా పోలంపల్లి తండా, స్టేషన్ గుండ్రాతిమడుగు, రాజోలు గ్రామాల్లో మొదటిరోజు యాత్ర సాగింది. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రైతు భరోసా, రుణమాఫీ పూర్తిగా ఇచ్చేవరకు పోరాటం ఆపనని చెప్పారు.

లోకం పోకడ

పిల్లలకు అసలు ఏం నేర్పుతున్నారు? శ్రీశైలం తెలంగాణలో ఉందట.. దిల్‌షుక్‌నగర్ విమానాలకు ప్రసిద్ధి అట.. హైద్రాబాద్ చుట్టూ సముద్రం ఉందట..

కాంగ్రెస్ పాలనలో రైతన్న అగచాట్లు

అన్నింటికీ ఎదురుచూడాల్సిన దుస్థితి : కేటీఆర్

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పాలనలో అన్నింటా రైతన్నకు అగచాట్లు తప్పడం లేదని, దుక్కి దున్నే సమయం నుంచి పంట కొనుగోలు దాకా ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొన్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. పాలమూరులో పల్లీ, వైరాలో మిర్చి, బయ్యారంలో కరంటు, జగిత్యాలలో యూరియా కోసం ఇలా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో రైతులు సర్కార్‌పై నిరసన తెలుపుతున్న దృశ్యాలను ఏకరువు పెట్టారు. దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో దగాపడ్డ రైతన్న బతుకును కేసీఆర్ పదేండ్ల పాలన దరికి చేర్చి వెలుగులు నింపితే, ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ పాలన ఆ వెలుగులను చీకటి చేస్తున్నదని మండిపడ్డారు. రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ, కరంటు, యూరియా, సాగునీరు, కొనుగోళ్లు ఇలా ప్రతీ సందర్భంలో రైతులు ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తంచేశారు. 'ఏడాది కాంగ్రెస్ పాలన.. ఎదురుచూపుల పాలన.. ఎట్లుండె తెలంగాణ,. ఎట్లాయె తెలంగాణ' అని పేర్కొన్నారు.

చిట్యాలలో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తుండగా.. కేసీఆర్ పాలననే నయమంటున్న రైతు

కేసీఆర్ ప్రభుత్వ పాలనే నయం

టైముకు రైతు బంధు టింగ్.. టింగ్‌మనేది

కాంగ్రెస్ నాయకుల ఎదుట రైతు ఆవేదన

చిట్యాల, జనవరి 30 : మీకన్నా కేసీఆర్ ప్రభుత్వ పాలనే నయం.. అని ఓ రైతు యువజన కాంగ్రెస్ నాయకుల ఎదుట ఆవేదన వ్యక్తం చేసిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాలలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు అల్లకొండ కుమా ర్ ఆధ్వర్యంలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్నారు. అక్కడే ఉన్న జూకల్‌కు చెందిన రైతు బుస్స బాపురావు 'బీఆర్ఎస్ ప్రభుత్వంలో టైముకు రైతు బంధు టింగ్.. టింగ్‌మనేది..' అని, జై కేసీఆర్ అంటూ నినదించాడు. కాంగ్రెస్ పాలనలో రైతుబంధు ఇంతవరకు జమకాలేదని, సంక్షేమ పథకాలు ఒక్కో మండలానికి ఒక్కో ఊరుకు మంజూరైతే మా ఊరికి ఎప్పుడు వస్తుందని నిలదీశారు. దీంతో యువజన కాంగ్రెస్ నాయకులు అక్కడి నుంచి నిష్క్రమించారు.

మరో రైతు ఆత్మహత్య

మొదటిపేజీ తరువాయి...

రూ.15 లక్షలు అప్పులయ్యాయి. దిగుబడులు అంతంత మాత్రంగానే రావడంతో చేసిన అప్పులకు వడ్డీలు రోజురోజుకు పెరుగుతున్నాయి. అప్పులు తీర్చే మార్గం కన్పించక తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. గురువారం సాయంత్రం ఇంటి వెనుక చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

రుణమాఫీ కాలేదని.. గుండెపోటుతో రైతు మృతి

భూపాలపల్లి జిల్లాలో విషాదం

వెంకటేశ్వర్లు(ఫైల్)

గణపురం, జనవరి 30: పంటలు పండకపోవడం, అప్పులు తీర్చలేక రెక్కల కష్టం చేసుకొని బతుకుతున్న రైతు రుణమాఫీపై గంపెడాశలు పెట్టుకున్నాడు. అటు రుణమాఫీ కాక ఇటు రైతు భరోసా లేక తీవ్ర మనోవేదనకు గురై గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషాద ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం కొండాపురంలో గురువారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పుట్ట వెంకటేశ్వర్లు(46) తన ఎకరం 28 గుంటల భూమిలో మిర్చి, వరి సాగు చేశాడు. కాలం కలిసిరాక దిగుబడి సరిగా రాక అప్పుల పాలయ్యాడు. పంటపై రుణం తీసుకున్న 60 వేలు ప్రభుత్వం మాఫీ చేయలేదు. అప్పులు తీర్చలేక మనోవేదనకు గురయ్యాడు. గురువారం తన పంట చేను వద్దకు వెళ్లి వచ్చిన వెంకటేశ్వర్లుకు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని వంద పడకల దవాఖానకు తరలించారు. అప్పటికే వెంకటేశ్వర్లు మృతి చెందినట్టు డాక్టర్లు చెప్పారు.